క్లుప్తంగా

తుళ్లూరు గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ



తాడికొండ: మండల కేంద్రమైన తుళ్లూరులోని గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులు పొందుతున్న తర్ఫీదును పరిశీలించారు. వేసవి నేపథ్యంలో విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై శిక్షణా శిబిరాన్ని ఉపయోగించుకునేలా చూడాలని గ్రంథాయలాధికారి టి.గిరిధర్ కుమార్‌కు సూచించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మంగళగిరి డోలాస్‌నగర్ రైలు పట్టాలపై రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యకి (25) అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ ఎస్ఐ రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వివరాలు తెలిసిన వారు జీఆర్పీ ఎస్ఐ రమేష్‌బాబు 9908383300 నంబరుకు సమాచారం తెలియజేయాలని కోరారు.

కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరగనున్న మహోత్సవాలు శనివారం అట్టహాసంగా మొదలయ్యాయి. ఉదయం అమ్మవారికి శ్రీలక్ష్మీ గణపతి హోమం, వాస్తు హోమం, రుద్ర చండీ హోమాలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తికి 108 కలశాలతో క్షీరాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం విద్యుత్తు దీపాలంకారణాలతో తీన్‌మార్, కోలాటలతో వైభవంగా పురవీధుల్లో చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరవ్వగా, ఆలయ దేవస్థాన కార్యనిర్వహణాధికారి పాదర్తి దుర్గారావు, పాలక మండలి సభ్యులు, ఆర్యవైశ్య సంఘాలు పాల్గొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన: కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇల్లు ఆక్రమించిన వ్యక్తిని ప్రశ్నించగా, ఇంటి యజమానురాలితో అసభ్యంగా వ్యవహరించి, బెదిరించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోబాల్ట్‌పేట 8వలైనులో నివాసం ఉండే నారాయణమ్మ తన ఇంటిని అద్దెకు వచ్చింది. అద్దెకు ఉండేవారు అద్దె చెల్లించకపోగా ఇంటిని ఆక్రమించారు. నారాయణమ్మ ఇల్లు ఖాళీ చేయాలని చెప్పడంతో ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించి చంపుతామంటూ బెదిరించారు. బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. చెవుల మన్నయ్య, చెవుల బోడయ్య, మరో ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో కబ్ బోర్డులో ఉంచిన నగలు చోరీకి గురైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పీఎస్ నగర్‌కు చెందిన ఎం.పావని బెడ్‌రూములోని కబ్‌బోర్డులో 25 సవర్ల బంగారు ఆభరణాలు పెట్టారు. అవి చోరీకి గురయ్యాయి. తెలిసిన వారే బంగారు ఆభరణాలు చోరీ చేశారని పావని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై దాడిచేసిన భర్తపై కేసు

గుంటూరు ఈస్ట్: భార్యను ఇనుప రాడ్‌తో తలపై మోది గాయపరిచిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేవీపీ కాలనీలో నివాసం ఉండే వడ్డీ కాసులతో ఐదు సంవత్సరాల క్రితం కె.లక్ష్మికి వివాహమైంది. వీరి మధ్య విభేదాలు రావడంతో రెండు సంవత్సరాల క్రితం విడిపోయారు. శనివారం వడ్డీకాసులు తన భార్య నివాసానికి వెళ్లి గొడవ పెట్టుకుని ఇనుప రాడ్డుతో తలపై మోదాడు. దాడిలో తలకు తీవ్రంగా గాయాలవడంతో లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని, అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువ్యాధులు ముసురు కాలం

- వర్షాకాలంలో పశువులు పలు వ్యాధుల బారిన పడే అవకాశం
- పాలదిగుబడిపై ప్రభావం.. అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే నష్టం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశువైద్యులు





తాడేపల్లిరూరల్: వర్షాకాలం వస్తుందంటే పాడి రైతుల్లో ఆందోళన, గుబులు పుడుతుంది. ముఖ్యంగా ప్రస్తుతం వేసవి కాలంలో వానలు పడుతుండడంతో పశువులకు వచ్చే వ్యాధులపై పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రైతులు వ్యవసాయ ఆధారిత పంటలతో పాటు పాడి పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. వ్యవసాయంలో ఎంత కరువు వచ్చినా, ఎంత నష్టం వచ్చినా ఆ లోటును పాడి పరిశ్రమతో తీర్చుకుని జీవనం సాగిస్తుంటారు. అయితే తగినన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే వర్షాకాలంలో పశువులకు కొన్ని రకాల వ్యాధులు సోకే ప్రమాదముందని పశువైద్యులు తెలియజేస్తున్నారు.

గొంతువాపు వ్యాధి..

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చేది గొంతువాపు వ్యాధి. ఇది పాశ్చరెల్లా మల్టోసిడా అనే సూక్ష్మజీవుల వల్ల వ్యాపిస్తుంది. దీనినే గురకవ్యాధి అంటారు. వర్షాకాలంలో గేదెలు, ఆవులు ముఖ్యంగా దూడల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కారుతూ గురక, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. జ్వర తీవ్రత 106, 107 డిగ్రీల వరకూ ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో మరణం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

నివారణ చర్యలు..

వర్షాకాలం ముందు జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలి. వ్యాధి ఉన్న పశువుల దొడ్డిని, గదులను ఫినాయిల్, క్రిసాల్ క్రిమి సంహారక ద్రావణంతో పరిశుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే పశువుల మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి సోకిన పశువులకు వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిన్, ఇంటాసెఫ్‌టాజు, ఎక్సెప్టై వంటి ఇంజక్షన్లు ఇవ్వాలి. తప్పని సరిగా పశువైద్యాధికారిని సంప్రదించాలి.

గాలికుంటు వ్యాధి, నంజు జ్వరం

ఇది వైరస్ లేదా కలుషితమైన గాలి ద్వారా వస్తుంది. తల్లిపాలు ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో గేదె, ఎద్దు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. గిట్టలు వున్న ప్రతి జీవికి ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం ఉంటుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి నడవలేని స్థితికి చేరుకుంటాయి. నోటి, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3,4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా ఏర్పడతాయి. నోటి చిగుళ్ళపై పొక్కులు ఏర్పడడం వల్ల పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి.

నివారణ చర్యలు..

ఈ వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు పరమాంగనెట్ ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె రాయాలి. యాంటిబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది. బిస్పెపెన్ 2.5, ఎన్‌రోప్లాక్సిన్ 50 ఎంఎల్, సెఫ్‌ట్రిక్సిన్ 3 గ్రాములు, మెలోనెక్స్ 30 ఎంఎల్, నియోవట్ 50 ఎంఎల్ వాడితే పశువులు పూర్తి ఆరోగ్యంగా ఉంటాయి.

జబ్బ వాపు

ఈ వ్యాధి క్లాస్ట్రిడియం చావై బ్యాక్టీరియా ద్వారా సోకుతుంది. ఈ వ్యాధి పశువులకు ప్రాణహాని కలిగించే తీవ్రమైన అంటువ్యాధి. తెల్ల పశువుల్లో, ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు వయసున్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. ఈ వయసులో పశువుకు రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. మట్టి ద్వారా, కలుషితమైన మేత, నీటి ద్వారా పశువు శరీరంలోకి ప్రవేశించి వ్యాధి సంభవిస్తుంది.

నివారణ చర్యలు

వ్యాధి ప్రారంభంలోనే పెన్సిలిన్ వంటి యాంటి బయోటిక్స్ వాడాలి. వ్యాధిగ్రస్త పశువులను వేరుగా ఉంచాలి. వ్యాధితో చనిపోయిన పశువులను గుంత తీసి పూడ్చిపెట్టాలి.

గొర్రెలకు, మేకలు వ్యాపించే వ్యాధులు..

వర్షాకాలంలో పచ్చగడ్డి ఎక్కువగా పెరుగుతుంటుంది. ఈ గడ్డిని తినే మూగజీవాల కడుపులో సూక్ష్మ క్రిములు వెళ్లి చిటుకు వ్యాధి (దొమ్మరోగం) వస్తుంది. ఈ వ్యాధి సోకిన వెంటనే గొర్రె లేక మేక అతి తక్కువ సమయంలోనే మృతి చెందుతుంటుంది.

నివారణ చర్యలు

ఈ వ్యాధి సోకడానికి ముందుగానే పశువైద్యులను సంప్రదించి ముందస్తు టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన తరువాత వాటిని రక్షించడం చాలా కష్టం. అందుకు ముందుగానే వైద్యులను సంప్రదించి పలు సూచనలు తీసుకుని సంబంధిత వ్యాధులు సోకకుండా టీకాలు వేయిస్తుండాలి.

పాడి రైతులు శ్రద్ధ చూపాలి...



వర్షాకాలం వస్తుందంటే రైతులు పశువులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. పశువులకు ప్రధానంగా వర్షం పడిన తరువాత చిగురించే చిరుగడ్డి వల్ల వ్యాధులు సోకుతుంటాయి. గొంతువాపు లక్షణాలు బయట పడిన 24 గంటల్లోనే పశువు మృత్యువాత పడుతుంది. అందువల్ల వ్యాధి సోకకముందే టీకాలు వేయించాలి. గాలికుంటు వ్యాధి రాకుండా సంవత్సరానికి రెండు సార్లు వ్యాక్సిన్లు చేయించాలి.

– డాక్టర్ నరేంద్రరెడ్డి, పశువైద్యులు, తాడేపల్లి

నిర్దేశిత లక్ష్యాల ప్రకారం వ్యాక్సినేషన్

టీబీ కంట్రోల్ ప్రోగ్రాం రాష్ట్ర జేడీ డాక్టర్ టి.రమేష్



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్, పక్కన డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: టీబీ రాకుండా పెద్దలకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్లు అందిస్తున్న దృష్ట్యా వైద్య సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం అందరికీ వ్యాక్సిన్లు వేయించాలని క్షయ నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సమావేశ మందిరంలో వైద్యాధికారులు, స్పెషలిస్ట్ డాక్టర్లతో శనివారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన సమీక్ష జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమేష్ మాట్లాడుతూ అడల్ట్ బీసీజీ వాక్సినేషన్‌లో గుంటూరు జిల్లా వెనుకబడటానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ చేయించుకున్న ప్రతి ఒక్కరిని 3 నెలలకు ఒకసారి 3 సంవత్సరాల పాటు ఫాలో అప్ చెయ్యాలన్నారు. వ్యాక్సిన్ వే యించుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికా రి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణుల నమోదు తక్కువగా ఉన్న ఆరోగ్య కేంద్రాల వారు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు చేసి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కాన్పుల కోసం 108 అంబులెన్సు వాహనాల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. ట్యూబెక్టమీ శిక్షణ పొందిన డాక్టర్స్ వెంటనే తాము పనిచేస్తున్న ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్లు ప్రారంభించాలన్నారు. ఎలాక్ట్రానిక్ హెల్త్ రికార్డులు ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలని, ఇందుకోసం ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న పురుష ఆరోగ్య కార్యకర్తల సేవలు ఉపయోగించుకోవాలన్నారు. జిల్లా టీబీ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, ఎన్‌సీడీ ప్రొగ్రామ్ జిల్లా అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డీఐఓ డాక్టర్ కె.వి.సుబ్బరాజు, ఎన్‌హెచ్ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇ.అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి విశేష పూజలు



భక్తులకు దర్శనమిచ్చిన వాసవీ అమ్మవారు



గంగానమ్మపేటలో పూజలు అందుకున్న అమ్మవారు

తెనాలిఅర్బన్: స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీవాసవీ అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా తెల్లవారుజాము నుండి విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 5.00 గంటలకు ప్రాతఃకాల అర్చనలు నిర్వహించారు. శ్రీ వింధ్య వాసినీ సమేత నగరేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అమ్మ వారికి అలంకారం తదుపరి సహస్ర నామాలతో ముత్తైదవులతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కుంకుమార్చన పూజలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అదే విధంగా వాసవి మూల మంత్ర హోమం, మహా మంగళ పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకున్నారు. సాయంత్రం రథోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఉత్సవాలను దేవస్థాన పాలకవర్గ అధ్యక్షులు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించగా ఉప్పల వరదరాజులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ గొడవర్తి సాయి హరేరామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దాళి శేషాచలం, నూకల భాస్కరరావు, ఆకి అచ్చుతరావు, గోపు రామకృష్ణ, గ్రంధి విశ్వేశ్వరరావు, కొణిజేటి శంకరరావు, అన్నవరపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ మాతకు కుంకుమార్చనలు..

తెనాలిఅర్బన్: సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో జరుగుతున్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ బాల స్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, వివిధ పుష్ప సహిత కుంకుమార్చన, శ్రీ లలితా సహస్రనామం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అమ్మవారి సంకీర్తనలు అలపించారు. అమ్మవారి జన్మదిన విశిష్టతను బాలస్వామిజీ తెలియజేశారు. కార్యక్రమంలో మఠం చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, ఉప్పల నాగేశ్వరరావు, గోపు రామకష్ణ, కమిటీ సభ్యులు దర్శి లక్ష్మీకాంతమ్మ, వరలక్ష్మి, గౌరి, జయలక్ష్మి మాతృ మండలి, శ్రీ లలితా సేవా సమితి సభ్యులు, సాలీగ్రామ మఠ సభ్యులు, అత్యాధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముగిసిన జన్మదిన వేడుకలు ..

తెనాలిరూరల్: పట్టణ బోసురోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి శ్రీ వాసవి అమ్మవారికి విశేష అభిషేకాలు పూజలు నిర్వహించగా సాయంత్రం నుండి ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి అన్నాబత్తుని పుష్ప, పెద్ద కుమారుడు అన్నాబత్తుని సత్యానారాయణ తదితరులు ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వాసవీ అమ్మవారికి చీర, రవిక, పూలు, పండ్లు, పసుపు-కుంకుమ సమర్పించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు వాహనం వద్ద పూజలు చేశారు. శోభాయమానంగా అలంకరించిన వాహనంలో పట్టణ వీధుల గుండా అమ్మవారి ఊరేగింపు ఎంతో వైభవంగా సాగింది. అనంతరం రాత్రి ఆలయానికి చేరుకున్న తర్వాత ఊంజల సేవ, పవళింపుసేవ, నిరాజన మంత్ర పుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన సత్రం కమిటీ పాలక వర్గ సభ్యులు పర్యవేక్షించారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో నివాసముంటున్న ఓ వ్యక్తి తన కుమార్తె కనిపించడం లేదంటూ శనివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బ్రహ్మానందపురానికి చెందిన తలపాల దాసు కుమార్తె కీర్తన బీటెక్ పూర్తిచేసి ఓ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కీర్తనను ఉద్యోగం చేయడానికి వీలులేదని, చేస్తున్న ఉద్యోగం తాలూకా జీతం కూడా తీసుకురావడం లేదని తల్లి మందలించడంతో కీర్తన శుక్రవారం ఉద్యోగానికి కని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. సదరు ఇన్స్యూరెన్స్ కంపెనీ వద్ద, పలు ప్రాంతాల్లో విచారణ చేసినా ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి దాసు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపారు.

బైక్ చోరీపై...

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ వద్ద బైక్ చోరీపై శనివారం తాడేపల్లి ఎస్ఐ సాయిప్రసాద్ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దుగ్గిరాలకు చెందిన సందీప్ పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీ కేఎల్ యూనివర్సిటీ గేటు ముందు తన ద్విచక్రవాహనం పార్క్ చేసి లోపలకు వెళ్లాడు. సాయంత్రం 5 గంటలకు బయటకు వచ్చి చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. జరిగిన ఈ సంఘటనపై ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపారు.

సుందరయ్య వర్ధంతి సభను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, సీపీఎం పూర్వ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో కార్యక్రమం నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజీ, సీనియర్ నాయకులు జొన్న శివశంకర రావు, రూరల్ మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొననున్నారని, ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఓట్ల లెక్కింపుపై అప్రమత్తత అవసరం

నెహ్రూనగర్: కౌంటింగ్ విధులకు ఎంపికైన అధికారులు, సిబ్బంది ఓట్ల లెక్కింపుపై అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని గుంటూరు వెస్ట్ రిటరి్నంగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, ఉద్యోగులు నిర్వహించవలసిన విధులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, పోటీ చేసిన రాజకీయ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులకు లెక్కింపు తేదీ, సమయం గూర్చిన వివరాలను నోటీసు ద్వారా సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పాటు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరిగే యూనివర్సిటీలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించిన అధికారులకు, సిబ్బందికి గుర్తింపు కార్డులను అందజేయాలని, సెక్టార్, పోలింగ్ కేంద్రాల వారీగా టేబుల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజంట్లు లెక్కింపు కేంద్రంలోనికి వచ్చేందుకు వేరువేరుగా మార్గాలు ఉండాలని, అవసరమైతే బారికేడింగ్ చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలను ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, సదరు విజువల్స్‌ని యూనివర్సిటీ ప్రాంగణంలోని కంట్రోల్ రూమ్‌లో చూడవచ్చని అభ్యర్థులకు తెలియచేయాలన్నారు. కౌంటింగ్‌కు అవసరమైన మెటీరియల్ చెక్ లిస్ట్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. టేబుళ్ల వారీగా, రౌండ్ల వారీగా ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్లు, కంప్యూటర్లు, డిజిటల్ స్క్రీన్ ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఈఈలు కొండారెడ్డి, కోటేశ్వరరావు, సూపరింటెండెంట్లు వెంకట రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత



పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్వేత

ఫిరంగిపురం: గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యురాలు శ్వేత అన్నారు. మండలకేంద్రంలోని సచివాలయం-2 పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో శనివారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 251మందికి షుగర్, బీపీ, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి డాక్టర్ శ్వేత తెలిపారు. వేసవిలో కురిసే వర్షాలలో తడవకుండా ఉండాలన్నారు. రక్తహీనత లేకుండా ఆకుకూరలు, పాలు, పండ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. సీహెచ్ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఏఎన్ఎం మాబు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి ఆశ్రయం



దామర్ల కృష్ణయ్యతో మాట్లాడుతున్న విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ స్వాతి గౌడ్

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని కొప్పురావూరు కాలనీ 9వ లైన్‌లో రోడ్డుపై నివాసముంటున్న ఓ వృద్ధుడిని స్థానికులు విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్‌కి శనివారం సమాచారం అందించి ఆశ్రమంలో చేర్పించారు. ఈ సందర్భంగా విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఫౌండర్ స్వాతి మాట్లాడుతూ కొప్పురావూరు కాలనీ 9వ లైన్‌లో రోడ్డుపై నివాసముంటున్న దామర్ల కృష్ణయ్య అనే వృద్ధుడు అనారోగ్య కారణంగా కదలలేని పరిస్థితిలో ఉన్నట్లు సమాచారం రావడంతో వెంటనే అక్కడకు వెళ్లి వైద్యం అందించి నవులూరులోని శివశక్తి ఆశ్రమంలో నివాసం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మెంబర్లు బొడ్డేటి రమేష్, కాటూరి శ్యామ్ శివ, స్థానికులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటం నుంచి పెదవడ్లపూడి రైస్ మిల్లులకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం అధికారులు తెలిపిన వివరాల మేరకు బియ్యంతో పాటు ఆటోడ్రైవర్ జల్లిపల్లి శ్రీరామ్‌ను విచారించగా విజయవాడ రూరల్, తాడేపల్లి ప్రాంతాలలో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించి రీసైక్లింగ్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎండీఎం ఆపరేటర్ల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారని, తరలించే వారితో పాటు మిల్లుల యజమానులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ.శ్రీహరిరావు తెలిపారు.

త్యాగరాజస్వామి జయంతి మహోత్సవం



గీతాలాపన చేస్తున్న బృంద సభ్యులు

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ స్వామి కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సంగీత సద్గురు త్యాగబ్రహ్మ 257వ జయంతి మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత టి.ఆదిత్యవాణి, టుబాకో బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్య అతిథి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ చిరస్మరణీయుడైన త్యాగరాజస్వామి జయంతి నిర్వహించటం విశేషమని అన్నారు. ఎంతో మంది యువ కళాకారులను ప్రోత్సహిస్తున్న గాయత్రీ మహిళా మండలి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం శ్రీత్యాగరాజ విరచిత పంచరత్న కృతుల గోష్ఠి గానం చేపట్టారు. ప్రధాన కచేరీలో విద్వాన్ ధూళిపాళ సాయిదీక్షిత్ (మల్లాది సూరిబాబు మనువడు)చే శాస్త్రీయ సంగీత కచేరీ జరగ్గా, త్యాగరాజ కృతులను అత్యద్భుతంగా గానం చేశారు. వీరికి వయోలిన్‌పై విదుషి గాయత్రీ విభావరి (చెన్నై), మృదంగంపై విద్వాన్ కుందుర్తి అరవింద్ (చెన్నై) చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. సమ్మండలి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎంవై శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజ రాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితదేవి, కార్యదర్శి మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొన్నారు. కళాకారులను, అతిథులను ఘనంగా సత్కరించారు.

అలరించిన నృసింహ గానవైభవం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం చింతలపాటి రమామహేశ్వరి బృందంతో నృసింహ గానవైభవం జరిగింది. బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. గాయనీమణులు చింతలపాటి రమామహేశ్వరి, ఇమ్మడి అంజనీదేవి, పావని, నాగలక్ష్మి బృందం హంసధ్వని రాగంలో తిరుమల గిరి రాయ, గంభీరనట రాగంలో శరణు శరణు, కళ్యాణి రాగంలో నవనారసింహ, సావేరి రాగంలో జయము జయము అంటూ పలు నృసింహ కీర్తనలను ఆలపించారు. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.